క్లుప్తంగా

తనిఖీలు పటిష్టం చేయాలి



బయ్యారం క్రాస్ రోడ్‌లోని చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

పినపాక: చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు మరింత పటిష్టం చేయాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని బయ్యారం క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం పోలీసులకు పలు సూచనలు చేశారు. ఇసుక లారీలను క్షుణ్ణంగా పరిశీలించి ధ్రువపత్రాలను తనిఖీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం, బయ్యారం ఎస్సైలు రాజ్ కుమార్, రాజేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

గోటి తలంబ్రాలు సమర్పణ



ఆలయ ఏఈఓకు గోటి తలంబ్రాలను అందజేస్తున్న భక్త బృందం

భద్రాచలం: ద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఖమ్మంకు చెందిన భక్త బృందం గోటి తలంబ్రాలను బుధవారం సమర్పించారు. శ్రీ లక్ష్మీబాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు తలంబ్రాలతో తొలుత ఆలయ ప్రదక్షిణ గావించారు. అనంతరం వాటిని ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్‌కు అందజేశారు. స్థానాచార్యులు స్థలశాయి, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాస్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జడ్జి భవాని, న్యాయవాదులు

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట శివారులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల సౌకర్యార్థం జూనియర్ సివిల్ జడ్జి భవాని చేతులమీదుగా బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీష్‌కుమార్, ఉడతనేని శ్రీనివాసరావు, శ్యాం సుధాకర్, సంధ్యారాణి, సంజయ్, అరుణకుమారి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

మణుగూరురూరల్: మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ తెలిపారు. బుధవారం మణుగూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్సై మేడ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ బంగారు జీవితాన్ని చీకటిమయం చేసుకోవద్దన్నారు. చదువుతోపాటు క్రీడా, ఇతర రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏఎస్ఐ శాంతి, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగ తోట పరిశీలన

దమ్మపేట: దమ్మపేట శివారులో రైతు తాళ్ల శంకర్ సాగు చేస్తున్న మునగ తోటను గ్రామపంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డి బుధవారం పరిశీలించారు. మూడు నెలల వయస్సు కలిగిన తోటను పరిశీలించి ఉపాధి హామీ పథకం ద్వారా త్వరలోనే ప్రోత్సాహక నగదు విడుదల చేస్తామని తెలిపారు. ఎకరా మునగ సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా విడతల వారీగా రూ.1.20లక్షలు అందుతున్నందున రైతులు ముందుకు రావాలని సూచించారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

మణుగూరుటౌన్: ప్రభుత్వ డిగ్రీ అతిథి అధ్యాపకుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించినందుకు ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ ఎమ్మెల్యేకు మణుగూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై శనివారం అసెంబ్లీలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రస్తావించడంతో మణుగూరు డిగ్రీ కళాశాల అతిథి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. జబ్బర్, సతీష్‌లు మాట్లాడుతూ.. తమకు 12 నెలలుగా జీతం చెల్లించడం లేదని, రోజువారీ బయోమెట్రిక్ ఆధారంగా జీతం చెల్లించడంతో ఎంతో నష్టపోతున్నామని అన్నారు. శిరీష, నవీన, శ్రీకాళ పాల్గొన్నారు.

గిరిజనుల తాగునీటి వెతలు

- సత్యంపేటలో 20 రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- అవసరాలకు వ్యవసాయ బోర్లే దిక్కు
- కొనుగోలు చేస్తేనే తాగునీరు



మరమ్మతుకు గురైన మోటార్..



వ్యవసాయ మోటారు నుంచి ట్యాంకర్‌తో నీరు తెచ్చుకుంటున్న స్థానికులు

ములకలపల్లి: నిండు వేసవిలో సత్యంపేట గ్రామస్తులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. 20 రోజులు నీటి సరఫరా నిలిచిపోవడంతో నానాతిప్పలు పడుతున్నారు. సమీపంలోని వ్యవసాయ మోటారు నుంచి నీళ్లు తెచ్చుకుని వాడుకుంటున్నారు. వేసవిలో నీటి కొరత రావద్దని జిల్లా కలెక్టర్ తోసహా సంబంధితశాఖ అధికారులు ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో అచరణకు నోచుకోకపోవడం శోచనీయం.

ములకలపల్లి మండలపరిధిలోని సత్యంపేట గ్రామంలో సుమారు 60 గిరిజన కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. డైరెక్ట్ పంపింగ్ (డీపీ) స్కీం ద్వారా గ్రామస్తులకు తాగునీటిని అందిస్తున్నారు. అదేవిధంగా ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు చెపుతున్నారు. అయితే అత్యధిక మంది డీపీ నీటినే వినియోగిస్తున్నారు. తాగునీటికి, స్నానాలు, ఇతర అవసరాలకు ఈ నీటినే ఉపయోగిస్తున్నారు.

పాడైన మోటార్.. సరిపోని 'భగీరథ'

డీపీ కోసం ఏర్పాటు చేసిన మోటారు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. 20 రోజుల కాలం గడుస్తున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారు. ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా అందిస్తున్న మిషన్ భగీరథ నీళ్లు సగం గ్రామానికే అందుతున్నాయని, మిగతా గ్రామం ఎగువ భాగంలో ఉండడంతో నీళ్లు పైకి ఎక్కడంలేదు. దీనికి తోడు ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రం చేయడం లేదని, ఆ నీటిని వాడితే గొంతులో నొప్పి వస్తోందని, ఒళ్లంతా దురదలు వస్తున్నాయని స్థానికులు చెపుతున్నారు. తమ సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వీరు గ్రామంలోని వ్యవసాయ మోటారు నుంచి నీటిని తెచ్చుకుని, అవసరాలు తీర్చుకుంటున్నారు. తాగునీటిని మాధారం గ్రామం నుంచి మినరల్ వాటర్ కొనుక్కొని తెచ్చుకుంటున్నారు. నిండు వేసవిలో తాగునీటి ఎద్దటిని ఎదుర్కొంటున్నామని, ఇకనైనా డీపీ మోటారు మరమ్మతులు చేపట్టి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు అభ్యర్థిస్తున్నారు.

అవస్థలు పడుతున్నాం..



మోటారు రిపేరు కావడంతో తాగునీటికి బాగా ఇబ్బంది అవుతోంది. వ్యవసాయ మోటారు నుంచి నీరు తెచ్చుకుంటున్నాం. ఇకనైనా సమస్యల తీర్చేలా చర్యలు తీసుకోవాలి.

– తెల్లం నరేష్, సత్యంపేట

అధికారులు దృష్టి సారించాలి



20 రోజులుగా నీటి కోసం నానా తంటాలు పడుతున్నాం. తాగునీటి పునరుద్ధరణకు అధికారులు దృషి సారించాలి. వెంటనే మరమ్మతులు చేపట్టి, నీటి సరఫరా కొనసాగించాలి.

– మిడియం శాంతకుమారి, సత్యంపేట

రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం..



డైరెక్ట్ పంపింగ్ (డీపీ) స్కీం మోటారు రిపేర్ కావడంతో తాగునీటి కొరత ఏర్పడింది. మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందిస్తున్నాం. రెండు రోజుల్లో నీటి సరఫరా పునరుద్ధరిస్తాం.

– వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీఓ, ములకలపల్లి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మారుమూల గ్రామీణప్రాంతాల అభివృద్ధే భద్రత బలగాల లక్ష్యమని సీఆర్పీఎఫ్ కోల్టా రేంజ్ డీఐజీ సూరజ్‌పాల్ వర్మ అన్నారు. బుధవారం సుకుమా జిల్లా కిష్టారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సలాటోంగ్ 217 సీఆర్ప్ఎఫ్ బెటాలియన్ క్యాంపులో సివిక్‌యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాంపు పరిధిలోని గ్రామాల ప్రజలకు వివిధ రకాల సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 217 బెటాలియన్ కమాండెంట్ విజయ్‌శంకర్, సెకండ్ ఇన్ కమాండింగ్ ఆఫీసర్స్ అరవింద్, ఆనంద్, నీరసింగ్ మీన్, డాక్టర్ మన్‌దీప్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ సంగీత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ ప్రజలకు వంట సామగ్రి అందజేస్తున్న అధికారులు

నిబంధనలు పాటించాలి



ఐటీసీ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో అర్హులైన కార్మికులందరికి స్కిల్డ్ మ్యాట్రిక్స్‌ను వర్తింపజేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. బుధవారం ఐటీసీ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) శ్యామ్‌కిరణ్‌ను ఐఎన్‌టీయూసీ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. స్కిల్డ్ మ్యాట్రిక్స్ అమలులో పెట్టిన కటాఫ్ తేదీన తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలు చేసిన 16 సంవత్సరాల సర్వీస్‌ను కాకుండా గతంలో అన్ స్కిల్డ్ నుంచి సెమీ స్కిల్డ్‌కు 7సంవత్సరాల సర్వీస్, సెమీ స్కిల్డ్ నుంచి స్కిల్డ్‌కు 6సంవత్సరాల సర్వీస్ ప్రకారం ఇప్పుడు కూడా వర్తింపజేయాలని కోరారు. కార్మికుల పనితీరుపై ఎలాంటి అవగాహన లేనటువంటి థర్డ్‌పార్టీ సర్వే రిపోర్ట్ ఆధారంగా కార్మికులకు స్కిల్డ్ వర్తింపజేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, మిత్రపక్షాల నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు కట్టడి



జేసీబీతో ట్రెంచ్ తవ్విస్తున్న ఎస్సై రాజేందర్, రెవెన్యూ అధికారులు

కరకగూడెం: ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కరకగూడెం ఎస్సై రాజేందర్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పెద్దవాగులో అక్రమ ఇసుక తోలకాలు అరికట్టేందుకు జేసీబీ యంత్రంతో ట్రెంచ్ తవ్వించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కరకగూడెం ఆర్ఐ కృష్ణ ప్రసాద్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడికి అభినందన

మణుగూరుటౌన్: ఏజెన్సీ ప్రాంతంలో పుట్టి ఇక్కడే ప్రభుత్వ వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ మార్తి సాయిమోహన్‌ను బుధవారం పలువురు అభినందించారు. వంద పడకల ఆస్పత్రిలో సాయిమోహన్ బుధవారంవైద్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యుడిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు శివసైదులు, కూచిపూడిబాబు, గాండ్ల సురేశ్, త్రిమూర్తులు, పల్లపు నాగేశ్వరరావు, యాకూబ్‌అలీ, తూపుడి శ్రీనివాస్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ, మార్కెట్ చైర్మన్

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు క్రీడా మైదానంలో దుమ్ముగూడెం యువత ఆధ్వర్యాన నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. తమ స్నేహితుడు చరణ్ జ్ఞాపకార్థం స్థానిక యువకులు టోర్నీ నిర్వహిస్తుండగా సీఐ బి.అశోక్, మార్కెట్ చైర్మన్ తెల్లం సీతమ్మ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వానికి ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడాకారులు కణితి రాముడు, తునికి కామేష్, తోట రమేష్, కోడి చంటి, వాగే కృష్ణ, నాగేశ్వరరావు, జెట్టి చంద్రశేఖర్, నిర్వాహక కమిటీ సభ్యులు హేమంత్, సుమన్, హరిరోహిత్, చంటి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో పీఎంశ్రీ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాలికా స్వీయ రక్షణ, సైబర్ నేరాలు, నివారణ, బాల కార్మికుల నిర్మూలన, డ్రంకెన్ డ్రైవ్ అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ మేరకు పాఠశాలలో వైఈసీ(యూత్ అండ్ ఎకో క్లబ్), జీసీఈసీ(గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్)లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలికలకు స్వీయ రక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం గురించి స్టాఫ్ నర్సు వరలక్ష్మి, సైబర్ నేరాలపై హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతి, యువత ఆవశ్యకత గురించి పాత్రికేయుడు మడిపల్లి వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రేణుక, కొచ్చెర్ల శ్రీనివాస్, ఆసిక్ ఆలం, రామారావు, రజిని, మంగమ్మ పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతి

ప్యూన్ పోస్ట్‌కు రాత పరీక్ష

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఆఫీస్ అటెండర్ పోస్టులకు బుధవారం సీఈఆర్ క్లబ్‌లో అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు పోస్టులకు 9 మంది అభ్యర్థులు హాజరు కాగా.. రాత పరీక్ష అనంతరం నలుగురిని ఎంపిక చేశారు. ఈ పరీక్షను అధికారులు శ్యాంసుందర్, సలగల రమేశ్, వెంకట్రావులు పర్యవేక్షించారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: సెర్ప్ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలపరిధిలోని జగన్నాథపురంలో బుధవారం ఏర్పాటు చేసిన వీఓఏల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఎండి.యూసఫ్, ఎస్‌కె.జబ్బార్, కనకలక్ష్మి, దుర్గ, షఫియా, కృప, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ దేవస్థానం హుండీ లెక్కింపు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీని బుధవారం లెక్కించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామివారి హుండీ లెక్కింపులో కానుకలుగా రూ.5లక్షల 10వేల 599ల ఆదాయం స్వామివారికి వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ తెలిపారు.

లైజన్ అధికారిగా వీరభద్రరావు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో ప్రాజెక్ట్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పెద్దమల్ల వీరభద్రరావు బీసీ ఉద్యోగుల సంఘం లైజన్ అధికారిగా నియామకమయ్యారు. ఈ నియామకంపై సింగరేణి బీసీ సంఘం నాయకులు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ.. బుధవారం పీవీకాలనీలోని ఇల్లెందు క్లబ్‌లో వీరభద్రరావును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంఘం ఏరియా అధ్యక్షుడు, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రోస్టర్ సైకిల్ ప్రకారం న్యాయం జరుగనుందన్నారు. అనంతరం లైజన్ అధికారి వీరభద్రరావుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం ఏరియా నాయకుల, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, పీకేఓసీ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె.శ్రీనివాస్, కోడి కృష్ణమూర్తి, షేక్ అబ్దుల్ రవూఫ్, వి.వెంకటరత్నం, షాబుద్దీన్, సాయిల సురేష్, సర్వర్ నభి, ఆవుల నాగరాజు, కృష్ణారావు, కోడి శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



లైజన్ అధికారి వీరభద్రరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

సీహెచ్‌సీనా.. ఏరియా ఆస్పత్రినా?

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఏడాదిన్నర క్రితం అప్‌గ్రేడ్ కాగా.. నేటికి ఆస్పత్రి వద్ద బోర్డు మాత్రం మారలేదు. అశ్వారావుపేటలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిని బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జీఓ నంబరు 441 ద్వారా 30 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ.. ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. కానీ స్థానిక ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద మాత్రం నేటికీ సామాజిక ఆస్పత్రి పేరుతోనే బోర్డు ఉండటంతో ఇదీ సీహెచ్‌సీనా.. లేక ఏరియా ఆస్పత్రినా అనే సందేహం స్థానికుల్లో నెలకొంది.



ఆస్పత్రి ప్రధాన మార్గం వద్ద ఇంకా సీహెచ్‌సీ పేరుతోనే ఉన్న బోర్డు

అక్రమ కట్టడాలను కూల్చివేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే కూల్చివేయాలని భద్రాచలం ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పైగా కొందరు అధికారులు చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. భద్రాచలం పట్టణంలోని ఆరు అంతస్తుల భవనం కూలిన ఘటనకు సంబంధించి బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ సభ్యులు డిమాండ్ చేశారు.

బాటిళ్లతో అలంకరణ!



బాదం చెట్టు కొమ్మలను బాటిళ్లతో అలంకరించిన దృశ్యం

అశ్వారావుపేటరూరల్: కాదేదీ..అలంకరణకు అనర్హం! అన్నట్లు ఓ బాదం చెట్టు కొమ్మలకు వాడి పడేసిన ఖాళీ బాటిళ్లను కట్టి అలంకరించి తన కళాత్మక ప్రయత్నం ప్రదర్శించాడు ఓ గిరిజనుడు. అశ్వారావుపేట మండలం గాడ్రాల గ్రామంలో రహదారి పక్కనే ఉన్న ఓ ఇంటి ఆవరణలో బాదం చెట్టు ఉంది. ఈ చెట్టు కొమ్మలకు దాదాపు యాభైకి పైగా ఖాళీ వాటర్, కూల్ డ్రింక్స్ బాటిళ్లను తాళ్లతో వేలాడేలా కట్టి అంకరించాడు. దీంతో కొమ్మలకు వేలాడుతున్న ఖాళీ బాటిళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాన్ని బుధవారం 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

భారీ యంత్రాలతో తోడేస్తున్నారు..

- దమ్మక్కపేట సొసైటీ రీచ్‌లో నిత్యం ఇదే తంతు
- ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్న అధికార యంత్రాంగం



సొంత లారీలు, యంత్రాల రాకపోకలకు గోదావరిలో గ్రావెల్ రోడ్డు వేసిన దృశ్యం

మణుగూరురూరల్: మండలంలో దమ్మక్కపేట సొసైటీ ఇసుక రీచ్‌లు దక్కించుకున్న ఓ బినామీ కాంట్రాక్టర్ అధికారుల అండదండలతో హవా జోరుగా కొనసాగిస్తున్నాడు. సొసైటీలు దక్కించుకున్న గిరిజనులకు కొంతమొత్తంలో ముట్టజెప్పి గోదావరిలో ఏకంగా భారీ యంత్రాలు పెట్టి వేలకు వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను ప్రైవేట్ నిర్మాణాలకు తోలేస్తున్నారు. ఇదంతా సంబంధిత శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

నిబంధనలకు మంగళం..

దమ్మక్కపేటలో వచ్చిన ఇసుక రీచ్‌లు దక్కించుకున్న రైజింగ్ కాంట్రాక్టర్ హవా శృతి మించుతోంది. దగ్గరలో ఓ కంపెనీ కోట్ల వ్యయంతో జరుగుతున్న నిర్మాణానికి అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా సొంత లారీలతో బల్క్ ఆర్డర్ పేరుతో ఒక్క కూపన్ పది ట్రిప్పులు అన్న చందంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏజెన్సీలో గిరిజనుల ఉపాధి కోసం సొసైటీగా ఏర్పడి జిల్లా కలెక్టర్‌కి, మైనింగ్ శాఖ అధికారులకు స్థానికులు దరఖాస్తు చేసుకోగా.. రీచ్ మంజూరు చేశారు. ఆ రీచ్‌ను దక్కించుకున్న సొసైటీ సభ్యులు రైజింగ్ కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ చేసుకున్నట్లు సమాచారం. సొసైటీ ఇసుకతో పాటు బల్క్ ఆర్డర్‌ను దక్కించుకున్న రైజింగ్ కాంట్రాక్టర్.. నిబంధనలు తుంగలో తొక్కి ఏజెన్సీలో ఉపాధి కోసం ఇచ్చిన ఇసుక రీచ్‌తో అధిక మొత్తంలో దన్నుకుంటున్నట్లు తెలుస్తోంది. గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసిమరీ యథేచ్ఛగా తోలకాలు చేస్తుండటమే ఇందుకు నిదర్శనం. ఏకంగా గోదారిలో సొసైటీ సభ్యుల ద్వారా ట్రాక్టర్లలో లోడింగ్ చేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న స్టాక్ పాయింట్ వద్ద అన్‌లోడింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ అవేవీ నిబంధనలు అధికారులు పాటించడం లేదు. నేరుగా గోదారిలోనే భారీ యంత్రాలతో లారీలకే లోడింగ్ చేసి పంపడం విశేషం.

రెండు రోజులు ఆగాల్సిందే!

ఇసుక ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకున్న లారీలు సీరియల్ పేరుతో రోజుల తరబడి వెయిటింగ్‌లో ఉంచుతుండటంతో ఆయా వాహనదారులు ఎర్రటి ఎండల్లో నానా ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత రైజింగ్ కాంట్రాక్టర్ స్వయానా సోదరుడి లారీలకు, స్థానిక లారీలకు మాత్రం నో వెయిటింగ్ పద్ధతిలో మరో రహదారి ఏర్పాటు చేసి మరీ గుట్టు చప్పుడు కాకుండా నిమిషాల వ్యవధిలో లోడింగ్ చేస్తున్నట్లు, ప్రైవేట్ నిర్మాణాలకు దానిని పంపుతున్నట్లు మండలంలో పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పటికీ గోదావరి చెంతకు వెళ్లకపోవడంతో అసలు విషయాలు బయటకు పొక్కలేదని తెలుస్తోంది. జిల్లా అధికారులు దమ్మక్కపేట ఇసుక క్వారీపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలు వెలికితీసి గిరిజనులకు, అవకాశాలు కల్పించాలని, తరలిపోతున్న సహజ సంపదను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.